

స్వామి హయాం.. అవినీతిమయం

టీడీపీ హయాంలో కొండపి ఎమ్మెల్యే బాలవీరాంజనేయ స్వామి, ఆయన అనుచరులు చేసిన అవినీతికి అడ్డూ, అదుపు లేకుండా పోయింది. - 8లో..



ఆటోను ఢీకొన్న కారు

యర్రగొండపాలెం మండలం నర్వాయపాలెం సమీపంలో వేగంగా వచ్చిన కారు ఆటోను ఢీకొని ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. - 8లో..

గరిష్టం/కనిష్టం
35/29

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఎంఈవోల సంఘ జిల్లా అధ్యక్షునిగా బత్తుల నాగేంద్రవదన్



ఎంఈవోల సంఘ నూతన జిల్లా కార్యవర్గం

ఒంగోలు: మండల విద్యాశాఖ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షునిగా బత్తుల నాగేంద్రవదన్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. స్థానిక ఒంగోలు మండల విద్యాశాఖ అధికారుల కార్యాలయంలో ఆదివారం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.కిషోర్ బాబు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.

నూతన కమిటీ ఇదే:

జిల్లా అధ్యక్షునిగా బత్తుల నాగేంద్రవదన్ (జరుగుమల్లి ఎంఈవో), ప్రధాన కార్యదర్శిగా దేవిరెడ్డి రామిరెడ్డి (వెలిగండ్ల ఎంఈవో), రాష్ట్ర ఉపాధ్యక్షునిగా తులసీ మల్లిఖార్జునరావు (త్రిపురాంతకం ఎంఈవో), కోశాధికారిగా వి.గిరిధర శర్మ (రాచర్ల ఎంఈవో), గౌరవాధ్యక్షులుగా డి.వెంకారెడ్డి (సంతనూతలపాడు ఎంఈవో), జె.వెంకటేశ్వర్లు (గిద్దలూరు ఎంఈవో), ఒంగోలు డివిజన్ అధ్యక్షునిగా ఈవీ రవణయ్య (నాగులుప్పలపాడు ఎంఈవో), మార్కాపురం డివిజన్ అధ్యక్షునిగా టి.రాజశేఖరరెడ్డి (త్రిపురాంతకం ఎంఈవో), మహిళా కార్యదర్శులుగా డి.సుజాత (తర్లుపాడు ఎంఈవో), పి.సరస్వతి(ఒంగోలు ఎంఈవో)లను ఎంపిక చేశారు.

బ్యాంకు పరీక్షలకు ఉచిత శిక్షణ

ఒంగోలు: బ్యాంకు పరీక్షలతోపాటు వివిధ పోటీ పరీక్షలకు నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు స్థానిక లాజిక్ అకాడమీ కరస్పాండెంట్ పి.విజయభాస్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో 4175 క్లర్కు పోస్టుల భర్తీ కోసం దేశవ్యాప్తంగా దరఖాస్తులు ఆహ్వానించారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద విద్యార్థులకు బ్యాంకు, త్వరలో రానున్న సచివాలయ ఉద్యోగాలకు 90 రోజులపాటు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈనెల 21లోగా తమ పేరు నమోదు చేసుకోవాలని, పూర్తి వివరాలకు సెల్ నంబర్ 7207012758 ను సంప్రదించాలన్నారు.



నాడు కరువుతో జిల్లా అల్లాడుతుంటే అధికారంలో ఉండి ఏం చేశావ్..ఊళ్లకు ఊళ్లు వలసబాట పడితే కనీస పలకరింపులేదు.. జిల్లాకు రావాల్సిన సాగర్ జలాలు రాబట్టలేకపోయారు. బిందెడు నీటి కోసం కిలోమీటర్లు వెళ్లాల్సిన దుస్థితి. జిల్లా అంతటా దయనీయమైన పరిస్థితులు నెలకొని ఉంటే నాడు ప్రభుత్వంలో నం 2గా ఉండి కూడా జిల్లా వైపు తొంగిచూడలేదు. మెరుపు తీగలా పశ్చిమానికి వచ్చి టిడ్కో ఇళ్లకు శిలాఫలకం వేసి వెళ్లిపోయావు. అంతే జిల్లా వైపు కన్నెత్తి చూస్తే ఒట్టు.. ఇంతటి ఘనకార్యం చేసిన నువ్వు నేడు యువగళం పాదయాత్ర పేరుతో జిల్లాకు ఏం ముఖం పెట్టుకుని వస్తున్నావు.. అంటూ జిల్లా వాసులు నిలదీస్తున్నారు.

ఇదేంది లోకేశం..!

- టీడీపీ హయాంలో ఐదేళ్లు కరువుతో అల్లాడిన జిల్లా
- మంత్రిగా, ప్రభుత్వంలో నం 2గా ఉంటూ జిల్లాని పట్టించుకోని వైనం
- పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా చేసిన అభివృద్ధి ఏంటి?
- ఒకే ఒక్కసారి జిల్లాకు వచ్చి మార్కాపురంలో టిడ్కో ఇళ్లకు శిలాఫలకం
- టిడ్కో ఇళ్లను పూర్తి చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- నేడు కొండపి, కనిగిరి నియోజకవర్గాల్లో యువగళం పాదయాత్ర చేయనున్న లోకేష్

ప్రతి సంవత్సరం కరువే

కరువు, కాటకాలు కూడా చంద్రబాబు నాయుడుతో పాటే పయనించాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లు జిల్లాలో దాదాపు అన్నీ కరువు మండలాలే..

- 2014–15 ఖరీఫ్‌లో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 56 మండలాలను ప్రకటించారు
- 2014–15 రబీలో కొరిశపాడు, మార్కాపురం, పెద్దారవీడు మండలాలను ప్రకటించారు
- 2015–16లో ఖరీఫ్‌లో 18 మండలాలను ప్రకటించారు.
- 2016–17లో ఖరీఫ్‌లో 56 మండలాలు, రబీలో కూడా మొత్తం 56 మండలాలను ప్రకటించారు.
- 2017–18లో చీరాల మినహా 55 మండలాలను ప్రకటించారు.
- 2018–19లో ఖరీఫ్‌లో అన్ని మండలాలను ప్రకటించిన ప్రభుత్వం రబీలో 40 మండలాలను ప్రకటించింది.

వర్షపాతం వివరాలు:

సంవత్సరం	సాధారణ వర్షపాతం	కురిసిన వర్షపాతం	లోటు వర్షపాతం (మిల్లీ మీటర్లలో)
2014	871.5	912.1	+40.6
2015	871.5	562.4	-309.1
2016	871.5	756.7	-114.8
2017	871.5	534.7	-336.8
2018	871.5	646.1	-225.4
2019	871.5	369.2	-502.3
2020	871.5	1105	-333.5
2021	871.5	985	-113.5
2022	871.5	1452	-181.5

సాక్షిప్రతినిధి, ఒంగోలు:

చంద్రబాబు నాయుడు పాలనలో జిల్లా కరువు, కాటకాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉండేది. సాగు నీటి సంగతి దేవుడెరుగు... 2014 నుంచి 2019 వరకు తాగునీటికీ గగనమయ్యేది. గొంతు తడుపుకోవాలంటే అష్టకష్టాలు పడాల్సి వచ్చింది. అలాంటి దుర్భర పరిస్థితులు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉండేది. పశ్చిమ ప్రకాశంలో అయితే పరిస్థితి మరీ దారుణం. తన తండ్రి చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆయన కేబినెట్‌లో రాష్ట్ర మంత్రిగా ఉన్న లోకేష్ ఒక్కసారి కూడా జిల్లా కేంద్రం ఒంగోలులో అడుగు పెట్టలేదంటే జిల్లాపై ఆయనకు ఏ మాత్రం ప్రేమ ఉందో అట్టే అర్థమవుతోంది. యువగళం పాదయాత్ర కొండపి నియోజకవర్గంలోని పొన్నలూరు మండలంలోకి చేరుకుంది. సోమవారం కొండపి మండలంలోని పొన్నలూరు, కనిగిరి నియోజకవర్గంలోని పీసీపల్లి మండలాల్లో లోకేష్ పాదయాత్ర చేయనున్నారు. నాడు జిల్లాలో సాగు, తాగునీటి కోసం ఏం చేశారో చూద్దాం.

సాగర్ జలాలను కూడా రాబట్టలేక..

జిల్లాకు సాగర్ జలాలు రాబట్టడంలో నాటి టీడీపీ ప్రభుత్వం తీవ్రంగా విఫలమైంది. వాతావరణం అనుకూలించకపోవటం.. వరుణుడు సైతం కరుణించకపోవడంతో సాగు, తాగునీటికి జిల్లా ప్రజలు నానా అవస్థలు పడ్డారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి వివరాలు, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సాగర్ జలాలు ఏవిధంగా జిల్లాకు వచ్చాయో ఈ లెక్కలు చూస్తే అర్థమవుతోంది. సాధారణంగా జిల్లాకు తాగు, సాగు నీటి అవసరాల కోసం దాదాపు 60 నుంచి 65 టీఎంసీల వరకు రాబట్టాల్సి ఉంది. అయితే 2015వ సంవత్సరంలో 25 టీఎంటీలు మాత్రమే జిల్లాకు సాగర్ జలాలు వచ్చాయి. 2016వ సంవత్సరంలో 4.64 టీఎంసీలు, 2017లో 20.25 టీఎంసీలు, 2018లో 36.22 టీఎంసీలు మాత్రమే సాగర్ నీటిని జిల్లాకు విడుదల చేశారు. ప్రభుత్వంలో కీలక మంత్రిగా ఉన్న లోకేష్‌కు జిల్లా సంగతి ఒక్కసారి కూడా గుర్తుకు రాకపోవడం శోచనీయం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత 2019–20లో 60.57 టీఎంసీలు, 2020–21లో 67 టీఎంసీలు, 2021–22లో 60 టీఎంసీల సాగర్ నీరు జిల్లాకు విడుదల చేశారు. 2022–23లో 63 టీఎంసీలు జిల్లాకు వచ్చి చేరాయి. దీంతో జిల్లాలోని ప్రజలు తాగు, సాగు నీటికి ఇబ్బందులు లేకుండా ఉన్నారు. 2023–24లో ఒంగోలు నగర ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు 2 టీఎంసీలు అవసరం కాగా ఇప్పటికే 1.5 టీఎంసీల సాగర్ జలాలను నగరంలోని రెండు ఎస్ఎస్ ట్యాంకులకు విడుదల చేశారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు తాగునీటి అవసరాల కోసం ఇప్పటికే కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్ 5 టీఎంసీలు సాగర్ జలాలు అవసరం అవుతాయని రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు.

ఒకే ఒక్కసారి పశ్చిమ ప్రకాశానికి

మంత్రిగా ఉన్న సమయంలో లోకేష్ ఒకే ఒక్క సారి పశ్చిమ ప్రకాశానికి వచ్చారు. అదీ కూడా మార్కాపురంలోని టిడ్కో ఇళ్ల శంకుస్థాపన కోసం. తండ్రి మాదిరిగానే తనయుడు కూడా శిలా ఫలకాలు వేయడంలో దిట్ట. అందుకేనేమో లోకేష్ కూడా మార్కాపురం పట్టణంలో టిడ్కో ఇళ్లకు భూమి పూజ చేయటానికి వచ్చి శిలాఫలకం వేసి వెళ్లిపోయాడు. మళ్లీ వాటి గురించి పట్టించుకోలేదు. అప్పట్లో లోకేష్ శిలాఫలకం వేసిన టిడ్కో ఇళ్లను ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పూర్తి చేస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు గుర్తుకు రాని ప్రకాశం జిల్లా ఇప్పుడు ఎందుకు గుర్తుకు వచ్చిందో లోకేష్ జిల్లా ప్రజానీకానికి చెప్పాల్సిన అవసరం ఉంది.

చంద్రబాబూ అంతే..

చంద్రబాబు నాడు సీఎంగా ఉంటూ జిల్లాపై సవతి తల్లి ప్రేమ చూపించారు. అభివృద్ధి పేరుతో అంతా డ్రామాలు ఆడారు. అందుకు వెలిగొండ ప్రాజెక్టు ప్రధాన ఉదాహరణ. ఈ ప్రాజెక్టుకు తొలుత శంకుస్థాపన చేసింది ఆయనే. కనీసం సర్వే చేయటానికి పైసా విదల్చలేదు. రెండోసారి ముఖ్యమంత్రి అయినా పట్టించుకోలేదు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత జలయజ్ఞం ద్వారా తొలుత రూ.5,600 కోట్లు కేటాయించి ప్రాజెక్టు పనులు ప్రారంభించారు. పనులు ముమ్మరంగా జరుగుతూ వచ్చాయి. ఆయన అకాల మరణం తర్వాత పనులు మూలన పడ్డాయి. 2014లో తిరిగి చంద్రబాబు నాయుడు సీఎం అయ్యాడు. అయినా వెలిగొండను పట్టించుకోలేదు. చివరకు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి పనులు వేగం పుంజుకున్నాయి. సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత ఒకటో టన్నెల్ పూర్తయింది. అక్టోబర్‌కల్లా రెండో టన్నెల్‌ను కూడా పూర్తి చేసి నల్లమల సాగర్ డ్యాంను నీటితో నింపాలని వైఎస్ జగన్ లక్ష్యంగా పెట్టుకున్నారు.

మార్కాపురం వైద్యశాలకు మహర్దశ

- వైద్యశాలలో అదనంగా 230 పడకల ఏర్పాటుకు సన్నాహాలు
- రూ.8 కోట్ల నిధులు కేటాయింపు
- మెడికల్ కాలేజీకి అనుబంధంగా బెడ్ల ఏర్పాటు
- 6 లక్షల మందికి ప్రయోజనం



మార్కాపురం జిల్లా వైద్యశాల

మార్కాపురం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైద్యానికి ప్రాధాన్యత ఇస్తోంది. కోట్ల రూపాయలు విడుదల చేస్తూ ప్రభుత్వాస్పత్రులను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దుతోంది. అందులో భాగంగా మార్కాపురం జిల్లా వైద్యశాలలో అభివృద్ధి పనులకు రూ.8 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో ఇప్పుడున్న 100 పడకలకు అదనంగా మరో 230 పడకలు ఏర్పాటు చేసే పనులు ప్రారంభించారు. మొత్తం 330 పడకలు ఏర్పాటు కానున్నాయి. ఈ ఏడాది చివరికి వీటిని ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మార్కాపురంలోని రాయవరం వద్ద 41.97 ఎకరాల విస్తీర్ణంలో రూ.475 కోట్ల వ్యయంతో మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మెడికల్ కాలేజీలో 100 సీట్లు రానున్నాయి. నర్సింగ్ కాలేజీ, మెడికల్ కాలేజీ, కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌లను ఏర్పాటు చేయనున్నారు.

లభించే సేవలు..

ప్రధానంగా పల్మనాలజిస్ట్ (ఊపిరితిత్తులు), సైక్రియాటిస్ట్, ఆర్థోపెడిక్, రేడియాలజిస్ట్, ఈఎన్‌టీ స్పెషలిస్ట్, డెంటల్ సర్జన్, ఆప్తామాలజిస్ట్, చిల్డ్రన్స్ స్పెషలిస్ట్, గైనకాలజిస్ట్, ఫిజియోథెరపిస్ట్, ఫోరెన్సిక్, కార్డియాలజిస్ట్ తదితర విభాగాల్లో వైద్యులు, ప్రొఫెసర్లను నియమిస్తారు. దీనితో పాటు ఈసీజీ, ఎక్సరే, ఐసీయూ, వెంటిలేటర్ లాంటి ఆధునిక సదుపాయాలు ఏర్పాటు చేస్తారు. కేటాయించిన స్థలంలో సిబ్బంది క్వార్టర్స్, మెడికోలకు హాస్టల్ నిర్మాణం కూడా జరుగుతుంది. అధునాతన వైద్య సేవలు అందుతాయి. డాక్టర్లు, సిబ్బంది క్వార్టర్స్ నిర్మిస్తున్నారు. మొత్తం 18 విభాగాలను ఏర్పాటు చేస్తారు. ఇందులో జనరల్ మెడిసిన్ బెడ్లు, ఎమర్జెన్సీ బెడ్లు, డెర్మటాలజీ, ఐసీయూ బెడ్లు, 8 ల్యాబ్‌లు, 4 లెక్చర్ థియేటర్లు, 250 మంది కూర్చునే ఎగ్జామినేషన్ హాళ్లు, 8 టీచింగ్ రూంలు నిర్మించనున్నారు. ఇక స్టూడెంట్ హాస్టల్స్‌తో పాటు నర్సింగ్ హాస్టళ్లు, సెంట్రల్ కిచెన్ హాల్, సెంట్రల్ డ్రగ్ స్టోర్, డయాలసిస్ సెంటర్, మెటర్నిటీ వార్డు తదితర భవనాలను కూడా నిర్మిస్తారు. ఒక్కో విభాగంలో 10 మంది డాక్టర్లు ఉంటారు. ఈ లెక్క ప్రకారం సుమారు 200 నుంచి 250 మంది వరకు సాధారణ వైద్యులతో పాటు స్పెషలిస్ట్ డాక్టర్లను నియమిస్తారు. కిడ్నీ రీసెర్చ్ సెంటర్ కూడా ఇక్కడే నిర్మించనున్నారు. ఇది పూర్తయితే జిల్లాలోని కిడ్నీ బాధితులకు కూడా డయాలసిస్‌తో పాటు మెరుగైన వైద్యసేవలు లభిస్తాయి. ప్రస్తుతం జిల్లా వైద్యశాలలో డయాలసిస్ సెంటర్ ఉంది. మార్కాపురంలోనే మెడికల్ కళాశాల ఏర్పాటు చేయటం వల్ల ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి రావటంతో పాటు స్పెషలిస్ట్ డాక్టర్లు కూడా ఉంటారు.

వేగంగా పనులు..

వచ్చే విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్లు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు అనుగుణంగా జిల్లా వైద్యశాలలో మొత్తం 330 బెడ్లు ఉండాలని వైద్య ఆరోగ్య శాఖాధికారులు నిర్ణయించి జిల్లా వైద్యశాలలో ఉన్న బిల్డింగులపై అదనపు బెడ్ల ఏర్పాటుకు పనులు ప్రారంభమయ్యాయి. మార్కాపురం మండలం రాయవరం వద్ద మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో వైద్యశాల భవనాలపై రోగుల కోసం అదనపు బెడ్లు ఏర్పాటు చేసేందుకు పనులు జరుగుతున్నాయి. మొత్తం రూ.8 కోట్లు మంజూరైనట్లు వైద్యశాల సూపరింటెండెంట్ సుబ్బారెడ్డి తెలిపారు. గత నెల 27న రాష్ట్ర మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ మురళీధర్‌రెడ్డి జిల్లా వైద్యశాలను తనిఖీ చేసి అదనపు బెడ్లను ఏర్పాటు చేయాలని ఆదేశించడంతో పనులు ప్రారంభమయ్యాయి. ఈ బెడ్లు పూర్తయితే సుమారు 230 మంది రోగులు ఇక్కడ వైద్యసేవలు పొందవచ్చు. డివిజన్‌లోని సుమారు రూ.6 లక్షల మంది ప్రజలకు జిల్లా వైద్యశాలలో సేవలు పొందే అవకాశం ఉంది.


వేగంగా పనులు జరుగుతున్నాయి



వెనుకబడిన మార్కాపురంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు విషయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చూపిన చొరవతో పనులు వేగంగా సాగుతున్నాయి. సీఎంకు ప్రత్యేక ధన్యవాదాలు. మెడికల్ కాలేజీ ఏర్పాటుతో అధునాతన వైద్య సేవలు, స్పెషలిస్టు వైద్యుల సేవలు అందుబాటులోకి వస్తాయి. సీఎం జగన్ ఇచ్చిన హామీని నెరవేర్చారు. మార్కాపురం ప్రాంత ప్రజలు ఆయనకు రుణపడి ఉంటారు. పనులు వేగంగా జరుగుతున్నాయి.

– ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి, మార్కాపురం

అదనపు బెడ్లకు ఏర్పాట్లు



మార్కాపురం జిల్లా వైద్యశాలలో ఇప్పుడున్న 100 బెడ్లకు అదనంగా మరో 230 బెడ్లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం రూ.8 కోట్లు మంజూరు చేసింది. పనులు వేగంగా జరుగుతున్నాయి. దీని వల్ల రోగులకు మెరుగైన సేవలు అందుబాటులోనికి వస్తాయి.

– డాక్టర్ సుబ్బారెడ్డి, సూపరింటెండెంట్ జిల్లా వైద్యశాల



జిల్లా వైద్యశాల భవనంపై జరుగుతున్న పనులు



మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు

వాలంటీర్లకు వందనం

కరోనా సమయంలో సహాయపడ్డాడు



కరోనా సమయంలో జనం ఇంటి నుంచి బయటకు రావాలంటే భయం, కనీసం చుట్టుపక్కల వారి పలకరింపునకు కూడా కరువైనప్పుడు మా వలంటీరు బెజవాడ సురేష్ ఏమాత్రం భయపడకుండా ఇంటికి వచ్చి పింఛను, మందులు, నిత్యవసర సరుకులు, కూరగాయలు అందించాడు. అలా ఇవ్వకుంటే బతికి ఉండే వాళ్లం కాదు. ప్రభుత్వం కరోనా కష్ట కాలంలో ఇచ్చిన రూ.1000 అందించాడు. అవి వేరే వారికి ఇస్తే మాకు దక్కేవి కాదు. ఇలా సేవ చేసే వలంటీర్లపై తప్పుడు కూతలు కూస్తున్న వారికి రాష్ట్ర ప్రజలే బుద్ధి చెబుతారు.

– దేవరంపాటి హరిబాబు, జమ్ములపాలెం, టంగుటూరు మండలం

ఉత్సాహంగా బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక



విజేతలైన చిన్నారులతో నిర్వాహకులు

ఒంగోలు: జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక ఆదివారం స్థానిక లార్డ్‌కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమీలో ముగిసింది. ఉత్సాహంగా సాగిన ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచి అంతర్‌జిల్లాల పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికైన క్రీడాకారుల జాబితాను లార్డ్‌కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమీ వ్యవస్థాపకుడు అద్దంకి మురళీకృష్ణ ప్రకటించారు. ఈ ఎంపికకు ముఖ్యఅతిథిగా హాజరైన ఒంగోలు ట్రాఫిక్ డీఎస్పీ విక్రమ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ క్రీడలు ఆరోగ్యానికి ఎంతో దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు జె.లక్ష్మణ్‌రెడ్డి , కార్యదర్శి పి.విజయకృష్ణ, కోశాధికారి అశోక్‌రెడ్డి, చీఫ్ రిఫరీ డాక్టర్ రమేష్ తదితరులు డీఎస్పీని ఘనంగా సత్కరించారు. అనంతరం వివిధ విభాగాల్లో విజేతలైన చిన్నారులకు ట్రోఫీలు అందించారు.

సంక్షేమ పాలనతో ప్రజల జీవితాల్లో వెలుగులు

- మంత్రి ఆదిమూలపు సురేష్

పుల్లలచెరువు: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలతో పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాయని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. శతకోడు సచివాలయ పరిధిలో ఆదివారం రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో మంత్రి సురేష్ ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడుతూ, సమస్యలు తెలుసుకుంటూ సంక్షేమ లబ్ధి బుక్‌లెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ కులమతాలు, పార్టీలు, వర్గాలకు అతీతంగా అర్హతే ప్రమాణికంగా తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే సంక్షేమ ఫలాలు అందిస్తోందని అన్నారు. పవన్‌కళ్యాణ్ డైలాగులు, పంచ్‌లు వేస్తున్నారని, ఆయనకు ప్రజల పట్ల చిత్తశుద్ధి ఎక్కడ ఉందని ప్రశ్నించారు. వలంటీర్ వ్యవస్థపై అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డికి ప్రజల్లో ఉన్న ఆదరణను ఓర్వలేక టీడీపీ, జనసేన, బీజేపీ కుట్రలు చేస్తున్నాయన్నారు. టీడీపీ గతంలో ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి, మళ్లీ ఇప్పుడు ప్రజల వద్దకు ఎలా వస్తారని ప్రశ్నించారు. గ్రామంలో పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకు రాగా వాటిని అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. ముందుగా మంత్రి సురేష్‌కు గ్రామ వీధుల్లో ప్రజలు పూలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రెంటపల్లి సుబ్బారెడ్డి, సర్పంచ్ యోహాను, పీఏసీఎస్ చైర్మన్ కిలారి కృష్ణ, తహశీల్దార్ దాసు, ఎంపీడీవో మరియదాసు, ఏవో నిర్మలాదేవి, ఏఈ కిషోర్, పశువైద్యాధికారి నాగలీమీరా, వీఆర్వో కిషోర్‌బాబు, కార్యదర్శి ఉదయ్‌కిరణ్, మాజీ నీటిసంఘం అధ్యక్షుడు జక్కె వెంకటేశ్వర్లు, పోలిరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, ఎంఎల్‌ఓ వాసు తదితరులు పాల్గొన్నారు.



శతకోడులో సంక్షేమ లబ్ధి బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి సురేష్

ఎక్కడున్నా పింఛన్ ఇచ్చి ఆదుకున్నాడయ్యా..


దంతం అంకమ్మ

కరోనా సమయంలో నేను కందుకూరు దగ్గర కోవూరులో ఉన్నాను. కరోనాతో బయటకు రావాలంటే భయం. సొంత గ్రామమైన అనకర్లపూడికి వచ్చే పరిస్థితి లేదు. ఇంతలో మా వలంటీర్ ఫిలిఫ్ కోవూరు వచ్చి పింఛన్ ఇచ్చి ఆదుకున్నాడు. అలా నాలుగు నెలలు కోవూరు వచ్చి పింఛన్ ఇచ్చి వెళ్లాడు. ఆ తరువాత మరోసారి కిందపడి కాలువిరిగింది. కూతురు దగ్గరే ఉంటే..అప్పుడు కూడా నాలుగు నెలలు వచ్చి పింఛన్ ఇచ్చిపోయాడు. వలంటీరే లేకుంటే నా పింఛన్ నాకు దక్కేది కాదు. చేతిలో చిల్లిగవ్వ లేక ఇబ్బంది పడేదాన్ని. జగనన్న వలంటీర్లను పెట్టి మా లాంటి ముసలోల్లకి ఏ ఇబ్బంది లేకుండా నెల నెలా డబ్బులు ఇస్తుండు.

క్లుప్తంగా

ఆర్మీ జవాన్ ఇంట్లో చోరీ

గిద్దలూరు రూరల్: పట్టణంలోని టీచర్స్ కాలనీలో నివాసముంటున్న చీమలదిన్నె శంకరయ్య అనే ఆర్మీ జవాన్ ఇంట్లో చోరీకి జరిగింది. ఎస్సై మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. శంకరయ్య భార్య దుర్గా ఇంటికి తాళాలు వేసి ఊరికి వెళ్లిన సమయంలో దొంగలు ఇంట్లోకి ప్రవేశించి బీరువా పగలగొట్టి అందులోని రూ.15 వేల నగదు అపహరించుకు వెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య


రమేష్ మృతదేహం

కంభం: పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని పోరుమామిళ్లపల్లిలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. బేస్తవారిపేట మండలం కలగొట్ల గ్రామానికి చెందిన పెంచికల రమేష్(42) గత పదేళ్లుగా మండలంలోని పోరుమామిళ్లపల్లిలో నివాసం ఉంటూ లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. మద్యానికి వ్యసనపరుడైన రమేష్ తరుచూ భార్యతో గొడవ పడుతూ ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించేవాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం భార్యతో గొడవ పడిన ఇతను ఇంట్లో ఉన్న పురుగుమందు తాగి నిద్రపోయాడు. తెల్లవారుజామున లేపి చూస్తే చనిపోయి ఉన్నాడు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకొని మృతదేహాన్ని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుమార్తెకు వివాహమైనట్లు తెలిసింది.

ట్రావెల్స్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ భీమానాయక్, ఎస్సైలు

మార్కాపురం: ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం సాయంత్రం పట్టణ శివారులోని జాతీయ రహదారిపై జరిగింది. కుటుంబసభ్యుల కథనం ప్రకారం..మండలంలోని పెద్దయాచవరం గ్రామానికి చెందిన గొట్టిపాటి చిన్నసుబ్బయ్య (50) ఆదివారం గ్రామస్తులు అల్లూరిపోలేరమ్మ గ్రామ దేవతకు కుంకుమ బండి కట్టడంతో అక్కడికి వెళ్లి పూజలు చేసుకుని భోజనం చేసి ఇంటికి వస్తున్నాడు. ఈ సమయంలో నెల్లూరు నుంచి శ్రీశైలంకు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు హైవేరోడ్డుకు సమీపంలో ఉన్న బోడపాడు టర్నింగ్ వద్ద ద్విచక్రవాహనంపై వస్తున్న చిన్నసుబ్బయ్యను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు బోరున విలపించారు. సంఘటనా స్థలానికి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. సీఐ భీమానాయక్, రూరల్ ఎస్సై వెంకటేశ్వరనాయక్‌లు ఘటనా ప్రాంతాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడికి ఇండియన్ ఐకాన్ అవార్డు


అవార్డుతో రాంభూపాల్‌రెడ్డి

గిద్దలూరు రూరల్: ప్రధాని నరేంద్రమోదీ ఇటీవల మన్ కీ బాత్ కార్యక్రమం ద్వారా గుర్తించిన 100 మంది వ్యక్తుల్లో ఒకరైన విశ్రాంత ఉపాధ్యాయుడు ఎం.రాంభూపాల్‌రెడ్డికి ఇండియన్ ఐకాన్ అవార్డు దక్కింది. జీసీఎస్ గ్రూపు వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ బోర్డు చైర్మన్ దామోదరగుప్తా, హ్యూమన్ రైట్స్ చైర్మన్ బాబురావు, తెలంగాణ ఉద్యమ నేత కోదండరాం, కేంద్ర సెన్సార్‌బోర్డు సభ్యులు ఉపేంద్ర గార్ల చేతుల మీదుగా ఇండియన్ ఐకాన్ అవార్డును అందుకున్నారు.


అవినీతికి ఇదే ఉదాహరణ నాగిరెడ్డిపాలెంలో తారురోడ్డు పక్కనే నిర్మించిన ఇంకుడు గుంత


ఎమ్మెల్యే స్వామి తీరుతో చౌటపాలెంలో నిలిచిన చెక్‌డ్యాం పనులు


తిమ్మపాలెంలో అటవీ భూమిని ఆక్రమించి జామాయిల్ సాగుచేసిన టీడీపీ నాయకులు


టీడీపీ నాయకుల అవినీతికి ఇదే పరాకాష్ట తిమ్మపాలెంలో శ్మశానంలో సమాధుల పక్కన నిర్మించిన నాడెప్ తొట్లు


ఎమ్మెల్యే స్వామి మరుగుదొడ్ల అవినీతికి ఇదే నిదర్శనం

అమ్మ స్వామీ.. దోచేసీ..దాచేసి

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కొండపి నియోజకవర్గంలో ఆ పార్టీ నేతల అవినీతి, అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండాపోయింది. కాదేదీ దోచుకునేందుకు అనర్హం అన్నట్లు ఎమ్మెల్యే స్వామి, ఆయన అనుచరులు ప్రతి పనిలోనూ పర్సంటేజీలతో కోట్లాది రూపాయలు దోచుకున్నారు. ఇంకుడు గుంతలు, మరుగుదొడ్లు, నాడెప్ తొట్లు, నీరు–చెట్టు, చెక్‌డ్యాంలు, చిన్న నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణాలు ఇలా అనేక పనుల్లో కాంట్రాక్టర్ల అవతారమెత్తి నాసిరకమైన నిర్మాణాలతో పాటు కొన్ని చోట్ల నిర్మించకుండానే పనిచేసినట్లు దొంగబిల్లులు పెట్టి అడ్డగోలుగా దోచేశారు.

- కొండపి నియోజకవర్గంలో ఎమ్మెల్యే స్వామి చేసిన అభివృద్ధి శూన్యం
- ఇంకుడు గుంతల దగ్గర నుంచి మరుగుదొడ్లు వరకు అంతా స్కామే
- నీరు–చెట్టులో పాత గోతులు చూపి రూ.35 కోట్లు మింగిన పచ్చచొక్కా నేతలు
- వ్యక్తిగత మరుగుదొడ్లలో దోపిడీ అక్షరాలా రూ.30 కోట్లు
- తిమ్మపాలెంలో రూ.34 కోట్ల విలువైన 1708 ఎకరాల అటవీ భూమి అన్యాక్రాంతం
- పని ఏదైనా సరే ఎమ్మెల్యే స్వామికి పర్సంటేజ్ ముట్టాల్సిందే

పొన్నలూరు/కొండపి: తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కొండపి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి శూన్యం..ఐదేళ్లు అధికారాన్ని వెలగబెట్టినా కొండపి నియోజకవర్గ ప్రజలకు కనీస, మౌలిక వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారు. స్థానిక ఎమ్మెల్యే డోలాశ్రీ బాలవీరాంజనేయస్వామి తన పదవీ కాలంలో నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను విస్మరించి అక్రమార్జనకే పెద్దపీట వేశారు. ప్రభుత్వ పథకాలు మంజూరు చేసేందుకు జన్మభూమి కమిటీల పేరుతో అందినకాడికి డబ్బులు దండుకున్నారు. అడ్డూ అదుపులేకుండా సాగిన దోపిడీకి స్థానిక ఎమ్మెల్యే స్వామి, షాడో ఎమ్మెల్యే సత్య ప్రధాన సూత్రధారులు.

మరుగుదొడ్లు, ఇంకుడు గుంతల నిర్మాణంలో చేతివాటం

టీడీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గానికి కేటాయించిన మరుగుదొడ్లలో 60 శాతం మేర నిర్మించకుండానే సొసైటీల పేరుతో బ్యాంకు ఖాతాలు తెరచి దొంగ బిల్లులు చేసుకొని ఎమ్మెల్యే స్వామితో పాటు జన్మభూమి కమిటీల పేరుతో చలామణి అయిన టీడీపీ నాయకులు దోచేశారు. పొన్నలూరు మండలంలో 2014 నుంచి 2019 వరకు 4842 మరుగుదొడ్లు మంజూరు కాగా వీటికి సుమారుగా రూ.4.80 కోట్లు చెల్లించారు. కొండపి నియోజకవర్గంలోని మిగిలిన మండలాలతో కలిపి సుమారుగా రూ.30 కోట్ల మేర స్వాహా చేశారు. ఇంకుడు గుంతల కార్యక్రమం టీడీపీ నాయకుల జేబులు నింపింది. పొన్నలూరు మండలంలో 6360 ఇంకుడు గుంతలు మంజూరు కాగా రూ.85.57 లక్షల బిల్లులు చెల్లించారు. కొండపిలో 3702 గాను రూ.57.64 లక్షలు, మర్రిపూడి 2681 గాను రూ.32.52 లక్షలు, టంగుటూరు 3952 గాను రూ.42.14 లక్షలు, సింగరాయకొండ 7243 గాను రూ.116.12 లక్షలు, జరుగుమల్లి 5448 గాను రూ.87.77 లక్షల బిల్లులు చెల్లించారు. ఇంకుడు గుంతలను అరకొరగా నిర్మించి పూర్తి స్థాయిలో నగదును లబ్ధిదారులకు చెల్లించకుండా ఎమ్మెల్యే స్వామితో పాటు టీడీపీ నాయకులు స్వాహా చేశారు. నాడెప్ తొట్లను కూడా నిర్మించకుండానే నిర్మించినట్లు రికార్డుల్లో చూపించి ప్రజా ధనాన్ని దోచుకున్నారు. తిమ్మపాలెంలో బిల్లులు కోసం నాడెప్ తొట్లను శ్మశానంలో సమాధుల పక్కన నిర్మించడం కొసమెరుపు.

అటవీ భూములు సైతం ఆక్రమణ:

గత టీడీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే స్వామి అండదండలతో యథేచ్ఛగా ప్రభుత్వ భూములను ఆక్రమించి చదును చేశారు. తిమ్మపాలెం గ్రామంలో చెరుకూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 787, 787/1తో పాటు మరికొన్ని సర్వే నంబర్లలో సుమారుగా 1708 ఎకరాల ఫారెస్ట్, పశువుల మేత బీడు భూములు విస్తారంగా ఉన్నాయి. దీంతో కొంత భూమిని ఆక్రమించి చదును చేసి గుట్టు చప్పుడు కాకుండా జామాయిల్, కంది, బత్తాయి, వరి, మినుము, పొగాకుతో పాటు వివిధ రకాల పంటలను సాగు చేశారు. ఆక్రమించుకున్న భూమి విలువ ఎకరా రూ.2 లక్షలు చొప్పున సుమారుగా రూ.34 కోట్లు ఉంటుంది.

ప్రాజెక్ట్ నిర్మాణ పనుల్లోను ముడుపులు

పొన్నలూరు మండలం చెన్నిపాడు సమీపంలో మాకేరు–పాలేరు నదిపై 2006లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జలయజ్ఞంలో భాగంగా రూ.50.50 కోట్లతో మధ్య తరహా జలాశయం నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. సంగమేశ్వర ప్రాజెక్టు నిర్మించడం వలన కొండపి నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు మేలు జరుగుతుంది. అయితే పనులు ప్రారంభించిన సబ్ కాంట్రాక్టర్లు ఒకరి తరువాత ఒకరు నలుగురు మారడంతో నిర్మాణ పనులకు అడ్డంకులు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత 2015లో ఎమ్మెల్యే స్వామి పనులు ప్రారంభించారు. కొన్ని రోజుల వరకు ప్రాజెక్టు మట్టికట్ట పనులు జరిగి ఆగిపోయాయి. కాంట్రాక్టర్‌కు, ఎమ్మెల్యేకు మధ్య ఆర్థికపరమైన విషయాల్లో సమన్వయం కుదరకపోవడంతో పాటు ముడుపులు చెల్లించలేక కాంట్రాక్టర్ పనులు వదిలేసి వెళ్లిపోయాడు. అలాగే చౌటపాలెం గ్రామం పందివాగుపై రూ.2.56 కోట్లతో నిర్మిస్తున్న చెక్‌డ్యాం పనుల్లో కూడా కాంట్రాక్టర్, ఎమ్మెల్యే స్వామికి పర్సంటేజ్ విషయాల్లో సమన్వయం కుదరక తరచూ పనులు ఆగుతూ వచ్చాయి. అలుగు నిర్మాణ పనులు 80 శాతం, మట్టికట్ట, రాతికట్ట పనులు 50 శాతం మాత్రమే అవగా, చెక్‌డ్యాం నిర్మాణ పనులు కేవలం 60 శాతమే అయ్యాయి. అయితే ఈ ప్రాజెక్టులను పూర్తి స్థాయిలో నిర్మించడానికి ఇటీవల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రీ టెండర్‌కు ఆహ్వానం పలికింది.

నీరు–చెట్టులో అందినంత అవినీతి

నియోజకవర్గంలో 2015 నుంచి 2019 వరకు నీరు–చెట్టు పథకం కింద సుమారు 500 పనులకు ప్రభుత్వం రూ.66 కోట్లు మంజూరు చేసింది. మంజూరైన నిధుల్లో రూ.50 కోట్లు వివిధ పనులకు ఖర్చు చేసినట్లు లెక్కలు చూపారు. ఇరిగేషన్ అధికారులతో కుమ్మక్కైన టీడీపీ నాయకులు ఉపాధి పనులు చేసిన చెరువులు, కుంటల్లో కొలతలు తీయించటంతో పాటు గ్రావెల్ ఎత్తిన పెద్ద గుంటలను సైతం కొలిపించి కొత్తగా పనులు చేసినట్లు రికార్డులు సృష్టించి రూ.25 కోట్లకుపైగా దోచుకుతిన్నారు. కొండపి వ్యవసాయ చెరువులోనే ఉపాధి పనులు చేసినచోటే రూ.30 లక్షలతో నీరు–చెట్టు పనులు చేశామని చెప్పి దోచుకున్నారు. దీంతో పాటు పెట్లూరు, వెన్నూరు, మూగచింతల, ముప్పవరం, అనకర్లపూడి, కే ఉప్పలపాడు, ఇలవర గ్రామాల్లో నీరు–చెట్టు పనుల్లో అవినీతి వరద పారింది. జరుగుమల్లి మండలంలో ఎస్ఎస్ కండ్రిక, పచ్చవ, చింతలపాలెం, దావగూడురు, నర్సింగోలు గ్రామాల్లో లేని కుంటలు ఉన్నట్లు చూపటం, కుంటల్లో ఉపాధి పనులు చేసిన చోట దరులు చెక్కి సుమారు రూ.95 లక్షలు దోపిడీ చేశారు. మర్రిపూడి మండలంలో మర్రిపూడి, గంగపాలెం, ధర్మవరం, అయ్యపరాజుపాలెం, తంగెళ్ల గ్రామాల్లో అధికంగా అవినీతి జరిగింది. రూ.14 కోట్లు ఖర్చు చేసినా పనుల వలన ప్రయోజనం లేకపోగా టీడీపీ నాయకుల నిర్వాకంతో పాతగుంతల్లో జేసీబీలు పెట్టి లోతుగా 10 అడుగులు మట్టితీసి కట్టలు వేయటంతో వర్షం నీరు చెరువులకు చేరకుండా పొలాల్లోనే ఇంకిపోతోంది. దీంతో 11 వ్యవసాయ చెరువులకు నీరు రాక చిల్లచెట్లు మొలిచి రైతులు వరి పంటలు వేసుకోవటం మానుకున్నారు. సుమారు 3 వేల ఎకరాల ఆయకట్టు బీడు భూములుగా మారిపోయాయి. పొన్నలూరు మండలంలో గొరిశలవాగు, పొన్నలూరు చెరువులో ఉపాధి పనులు చేసిన చోటే నీరు–చెట్టు పనులు చేసినట్లు బిల్లులు చేసుకుని తిన్నారు. సింగరాయకొండలో ఊరచెరువు, సింగరచెరువుల్లో ఉపాధి పనులు చేసినచోటే పనులు చేసినట్లు చూపి రూ.50 లక్షలు దోచుకుతిన్నారు.

నీరు–చెట్టులో అడ్డగోలుగా దోపిడీ



నీరు–చెట్టు ద్వారా గ్రామంలో టీడీపీ నాయకులు రూ.19 లక్షలకు పైగా నిధులు దోచుకున్నారు. గతంలో చేసిన ఉపాధి కుంటల్లో కొలతలు తీసి రికార్డు చేయించుకుని డబ్బులు స్వాహా చేశారు. నీరు–చెట్టు పేరుతో మొక్కలు వేశామని డబ్బులు డ్రాచేశారు. కానీ ఎక్కడా ఒక మొక్క వేసిందిలేదు. అంతా బూటకమే.

– బచ్చల కోటేశ్వరరావు, మూగచింతల

టీడీపీ నాయకులు బిల్లులు డ్రా చేసుకున్నారు



మరుగుదొడ్డి మంజూరైంది. నా సొంత డబ్బులతో కట్టుకున్నాను. నా పేరు మీద డబ్బులు రూ.15 వేలు ఎన్‌జీవో పేరుతో టీడీపీ నాయకులు ఏర్పాటు చేసుకున్న ఖాతాల్లో పడ్డాయి. కానీ నాకు ఇవ్వకుండా డబ్బులు తినేశారు. అడిగితే డబ్బులు పడలేదని చెబుతున్నారు. మా గ్రామాల్లోనే సుమారు పేదలకు సంబంధించి 50పైగా బాత్‌రూమ్‌ల దోపిడీ జరిగింది.

– యం అనీల్‌కుమార్, మూగచింతల

ఆటోను ఢీకొన్న కారు

- ఐదుగురికి తీవ్రగాయాలు
- ప్రమాద స్థలాన్ని పరిశీలించిన మంత్రి ఆదిమూలపు సురేష్



నక్కా బాలయ్య, వెంకట సుబ్బయ్య

యర్రగొండపాలెం: అతివేగంగా వచ్చిన కారు ఆటోను ఢీకొన్న ప్రమాదంలో ఐదుగురు రైతులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని సర్వాయపాలెం గ్రామానికి సమీపంలోని హైవే మూలపువద్ద ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే..బోయలపల్లి గ్రామానికి చెందిన నక్కా బాలయ్య, డి.వెంకటసుబ్బయ్య, జి.వెంకట పెద్దగురవయ్య, జి.వెంకటేశ్వర్లు, డి.వెంకట సుబ్బయ్యలు తమ పొలాల్లో పెంచేందుకు గురిజేపల్లిలో పెంచుతున్న మిరప నారుమడిని చూసేందుకు ఆటోలో బయలుదేరారు. సర్వాయపాలెం మూలమలుపు వద్ద మార్కాపురం వైపు నుంచి ఎదురుగా వచ్చిన తెలంగాణ రిజిస్ట్రేషన్ కారు అత వేగంగా వచ్చి ఢీకొనడంతో వారికి తీవ్రంగా గాయాలయ్యాయి. సంఘటన జరిగిన వెంటనే క్షతగాత్రులను యర్రగొండపాలెంలోని ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం పల్నాడు జిల్లా నరసరావుపేటకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి.కోటయ్య తెలిపారు.

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ యర్రగొండపాలెం ప్రభుత్వ వైద్యశాల డాక్టర్లకు ఫోన్‌లో ఆదేశించారు. పుల్లలచెరువు మండలంలోని శతకోడులో జరుగుతున్న గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొనేందుకు వెళ్తున్న సమయంలో ప్రమాదం జరిగిన విషయం తెలుసుకొని సంఘటన స్థలానికి చేరుకున్నారు. రోడ్డు ప్రమాద స్థలాన్ని పరిశీలించి వైద్యులతో పాటు పోలీసులను అప్రమత్తం చేశారు. అవసరమైతే క్షతగాత్రులను గుంటూరు, మార్కాపురం ప్రాంతాల్లోని వైద్యశాలలకు తరలించి మంచి వైద్యం అందించేలా తీసుకోవాలని అధికారులకు సూచించారు.

నకిలీ లోన్ యాప్‌లపై అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు: నకిలీ లోన్ యాప్‌లపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ మలికాగర్గ్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. ఫేక్ లోన్ యాప్‌ల పేరుతో కొంతమంది అమాయకులకు రుణాలు ఇస్తామని నమ్మించి మోసం చేస్తున్నారన్నారు. డబ్బు అవసరాలతో కొంత మంది ప్రజలు, విద్యార్థులు, వ్యాపారులు వీరి వలలో చిక్కుకుని మోసపోతున్నారన్నారు. రుణ నిబంధనలు పూర్తిగా చదవకుండా అంగీకరించడం ద్వారా అధిక వడ్డీల వేధింపులకు గురవుతున్నారన్నారు. రిజర్వు బ్యాంకు గుర్తింపు పొందిన బ్యాంకులు, ఫైనాన్షియల్ కంపెనీల వద్ద రుణం తీసుకోవడం శ్రేయస్కరమన్నారు. రుణాల పేరుతో యాప్ నిర్వాహకులు వేధింపులకు గురిచేయడంతో పాటు ఫొటోలు మార్ఫింగ్ చేసి వాటిని ఫోన్‌లోని కాంటాక్ట్‌లకు పంపిస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతుంటారని, ఈ క్రమంలో పరువే ప్రాణంగా భావించేవారు మానసిక ఆందోళనతో ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరమన్నారు. కనుక ఎవరు కూడా మానసిక స్థైర్యాన్ని కోల్పోకుండా , తొందరపడి ఆకస్మిక నిర్ణయాలు తీసుకోకుండా 1930 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. లేదా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ సెల్ పోర్టల్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సైబర్‌క్రైమ్.జీఓవి.ఇన్ అనే నంబర్‌కు ఫిర్యాదు చేయాలని ఎస్పీ మలికాగర్గ్ ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులకు సూచించారు.

ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలవాలి

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణ మాదిగ



ఉద్యోగులను అభినందిస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

ఒంగోలు: రిజర్వేషన్ వర్గీకరణలో చిత్తశుద్ధితో పనిచేస్తున్న ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి మాదిగ ఉద్యోగులు వెన్నుదన్నుగా నిలవాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. స్థానిక అంబేద్కర్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి మాదిగ ఉద్యోగుల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రధాని నరేంద్రమోడీని కలిసి రిజర్వేషన్ వర్గీకరణపై చర్చించామన్నారు. త్వరలో జరిగే పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లును ప్రవేశపెడతామని ప్రధాని హామీ ఇచ్చారని, అదే జరిగితే ఆయనకు దేశవ్యాప్తంగా మాదిగల మద్దతు ఉంటుందన్నారు. లేకుంటే మాదిగల సత్తా ఏంటో కూడా చూపుతామన్నారు. పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టే సమయంలో ఎవరైతే వర్గీకరణ బిల్లుకు మద్దతు పలుకుతారో వారికే ఎంఆర్‌పీఎస్ అండగా ఉ,టుందన్నారు. తెలంగాణలో చంద్రబాబు డప్పుకొట్టి, చెప్పుకుట్టి పెద్ద మాదిగను అని ప్రకటించారని, ఆయన తెలంగాణాలో తిరగలేని పరిస్థితుల్లో ఉంటే ఎంఆర్‌పీఎస్ ఆయనకు అండగా నిలిచిందన్నారు. కానీ అదే ఆయన గత ప్రభుత్వ హయాంలో కనీసం సమావేశాలు కూడా పెట్టనీయకుండా తనను అరెస్టులు చేయించిన విషయాన్ని గమనించాలన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కూడా తండ్రి ఆశయాల సాధనే లక్ష్యంగా పనిచేస్తున్నట్లుగా పేర్కొంటున్నారని అందువల్ల వైఎస్ రాజశేఖరరెడ్డి మాదిరే రిజర్వేషన్ వర్గీకరణ బిల్లుకు మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. ఆగస్టు రెండో వారంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న మాదిగల విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు కత్తి ఐజాక్ అధ్యక్షత వహించగా విశిష్ట అతిథిగా ఎంపీపీ కిరణ్‌ప్రభాకర్, మాదిగ ఉద్యగుల సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు బొంతా ఏసుదాసు, రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి భిక్షాలు తదితరులు పాల్గొన్నారు.